క్లుప్తంగా

జగన్నాడే మహరాజ్‌కు ఘన నివాళి


విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

ఆసిఫాబాద్‌అర్బన్: సంత్ శ్రీ సంతాజీ జగన్నాడే మహరాజ్ వర్ధంతి పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో అఖిల గాండ్ల తేలికుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సందీప్ మాట్లాడుతూ జగన్నాడే మహరాజ్ చూపించిన సన్మార్గంలో ప్రతీ ఒక్కరు నడుచుకోవాలన్నారు. సంఘం నాయకులు శ్రీనివాస్, పోచన్న, శంకర్, గణేశ్, లక్ష్మణ్, ఆకాశ్, తేలి కులస్తులు పాల్గొన్నారు.

ప్రతీ ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలి


దుప్పట్లు పంపిణీ చేస్తున్న అటవీ అధికారులు

తిర్యాణి: ప్రతీ ఒక్కరు సేవా దృక్పథం కలిగి ఉండాలని తిర్యాణి, గిన్నెదరి రేంజ్ అధికారులు శ్రీనివాస్, సరోజనరాణి అన్నారు. శనివారం అటవీశాఖ ఆధ్వర్యంలో మంగి గ్రామంలోని ప్రజలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ రైతులు పంట పొలాల్లోని వ్యర్థపదార్థాలకు నిప్పు పెట్టినప్పుడు అటవీ ప్రాంతంలోకి వెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ నాయకులు కుర్సెంగ మోతిరాం, కోట్నాక గణపతి, డిప్యూటీ రేంజర్ రవీందర్, ఎఫ్ఎస్‌వోలు వేణుగోపాల్, లక్ష్మణ్, సురేశ్ తదితరులు ఉన్నారు.

జాతర పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న గ్రామస్తులు

లింగాపూర్: మండల కేంద్రంలో ఏటా జరుపుకునే శ్రీ జగదాంబ దేవి జాతర పోస్టర్లను శనివారం గ్రామస్తులు గాంధీచౌక్ ఆవరణలో ఆవిష్కరించారు. గ్రామ నాయక్ కిరణ్ మాట్లాడుతూ జగదాంబ దేవి జాతర జనవరి 1వ తేదీ నుంచి 15 రోజుల పాటు కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జాదవ్ గణపత్, ఆడే హసిరాం, రామారావు, రమేశ్, ప్రకాశ్ తదితరులు ఉన్నారు.

'ధ్యానంతో ఏకాగ్రత పెరుగుతుంది'

దహెగాం: ధ్యానం చేయడం వల్ల ఏకాగ్రత పెరగడంతో పాటు ఆరోగ్యంగా ఉంటారని ఎస్సై కందూరి రాజు అన్నారు. జిల్లా పోలీసు అధికారుల ఆదేశాల మేరకు శనివారం మండల కేంద్రంలోని స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ధ్యానం, యోగా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతీరోజు ధ్యానం, యోగా తప్పనిసరిగా చేయాలని సూచించారు.

పోలీసుల కళాజాత


అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దహెగాం: మండలంలోని లగ్గాం గ్రామంలో శుక్రవారం రాత్రి పోలీసుల ఆధ్వర్యంలో సైబర్, విద్య, ట్రాఫిక్ రూల్స్, గుడుంబా తదితర అంశాలపై ఎస్పీ ఆదేశాల మేరకు అవగాహన కల్పించినట్లు ఎస్సై రాజు తెలిపారు. కళా బృందం సభ్యులు చెడు వ్యసనాలతో కలిగే నష్టాలను పాటల రూపంలో వివరించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. సైబర్ నేరగాళ్ల ఉచ్చులో పడితే 1930 నంబర్‌కు ఫోన్ చేయాలని సూచించారు. విద్యతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉండి చదువుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాబృందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఆసిఫాబాద్: జిల్లా కేంద్రంలోని ప్రధాన మార్కెట్‌లో ఆదివారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ట్రాన్స్‌కో ఏఈ లక్ష్మీరాజం ఒక ప్రకటనలో తెలిపారు. లైన్ మరమ్మతుల నేపథ్యంలో పట్టణంలోని గాంధీచౌక్, పొట్టిశ్రీరాముల చౌక్, కుమురంభీం చౌక్, బాపూనగర్, మార్కెట్ ఏరియాలో విద్యుత్ అంతరాయం ఉంటుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

నాణ్యత ప్రమాణాలకు తిలోదకాలు


ఒర్రెపై సిమెంట్ పైపులు వేసిన గుత్తేదారు

- ఇష్టారాజ్యంగా పనులు చేపట్టిన కాంట్రాక్టర్
- లోపించిన అధికారుల పర్యవేక్షణ
- పూర్తయిన లైన్‌గూడ, ఖమాన బీటీ పనులు

వాంకిడి: మండలంలోని వివిధ గ్రామాలకు బీటీ రహదారులు మంజూరు చేసిన ప్రభుత్వం నిధులు కూడా విడుదల చేసింది. పనులు దక్కించుకున్న గుత్తేదారులు రెండేళ్లుగా రోడ్డు వేయకుండా కాలయాపన చేశారు. రెండేళ్ల తర్వాత ప్రస్తుతం పనులు చేపడుతుండగా నాణ్యత ప్రమాణాలు పాటించడం లేదు. పనులను పర్యవేక్షించాల్సిన అధికారులు 'మామూలు'గా తీసుకుంటున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల ఖమాన గ్రామంతో పాటు, బంబార జీపీలోని లైన్‌గూడ గ్రామానికి వెళ్లే బీటీ పనులు పూర్తి చేశారు. చౌపన్‌గూడ రోడ్డు పనులు కొనసాగుతున్నాయి.

అధ్వానంగా రోడ్డు పనులు..

బంబార జీపీలోని లైన్‌గూడ గ్రామానికి వెళ్లే రహదారి నిర్మాణానికి గత ప్రభుత్వ హయాంలోనే నిధులు మంజూరు కాగా ఇటీవల సదరు గుత్తేదారు పనులు చేపట్టారు. రూ.80 లక్షల వ్యయంతో 1 కిలోమీటరు మేర చేపట్టిన రహదారి నిర్మాణంలో మొదటి నుంచే నాసిరకం పనులు చేపట్టినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఇంజినీర్లు గుర్తించిన మొరం వాడకుండా స్థానికంగా లభించే పొలంలోని మట్టిని వాడినట్లు తెలుస్తోంది. రోడ్డు కుంగిపోకుండా, ఎక్కువ కాలం పాడైపోకుండా ఉండాలంటే నాణ్యతతో కూడిన మొరంతో పాటు కంకర వేసి పలుమార్లు రోలింగ్ చేయాలి. ఎడ్లబండ్లు వెళ్లేందుకు రోడ్డుకు ఇరువైపులా మొరం మట్టితో చదును చేయాల్సి ఉంటుంది. కానీ ఇవేవి పట్టించుకోకుండా గుత్తేదారు ఇష్టారాజ్యంగా పనులు చేపట్టినట్లు పలువురు ఆరోపిస్తున్నారు. ఒక చోట కల్వర్టు నిర్మించాల్సి ఉండగా పైపులతోనే సరిపెట్టారు. బీటీ సైతం అనేక చోట్ల ఒక్క ఇంచు మందం కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంలా కనిపిస్తుంది. నాసిరకం మట్టి తొలగించేలా చర్యలు తీసుకుంటామని గతంలోనే అధికారులు చెప్పినా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు.


రోడ్డు అంచులపై తారు లేచిన చోట మొరం పోస్తున్న కూలీ

ఖమాన రోడ్డు నిర్మాణంలో సైతం..

మండల కేంద్రం నుంచి ఖమాన గ్రామం వరకు 2.5 కి.మీటర్ల బీటీ రోడ్డు నిర్మాణానికి గత ప్రభుత్వం రూ.కోటిన్నర మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తి అయిన కొన్ని నెలలకే సదరు గుత్తేదారు పనులు ప్రారంభించారు. రహదారిపై ఉన్న పాత డాంబరు నామమాత్రంగా తొలగించి మొరం వేయకుండానే పైనుంచి కంకర పోసి ఒకసారి రోలింగ్ చేసి వదిలేశారు. ఏడాది గడిచాక పనులు ప్రారంభించారు. రోడ్డుకు సరిపడా ఎత్తులో మొరం వేయాల్సి ఉండగా మెరుగులు అద్ది వదిలేశారు. అధ్వానంగా పనులు జరిగినా అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపణలు విన్పిస్తున్నాయి. కాగా మండల పరిధిలో చేపట్టే పనుల్లో ఇంజినీరింగ్ పనితనం తూతూ మంత్రంగా కన్పిస్తుంది. ఇంజినీరింగ్ అధికారులు పర్సంటేజీల కోసం గుత్తేదారుతో కుమ్మక్కవుతున్నారని, కాంట్రాక్టర్‌లకు సహకరిస్తుండటంతోనే పనుల్లో నాణ్యత ప్రమాణాలు లోపిస్తున్నాయని ఆరోపణలు ఉన్నాయి.

నాసిరకం పనులు చేపట్టారు



ఖమాన రహదారి మంజూరై దాదాపు రెండేళ్లు కావస్తుంది. నిర్మాణ పనులు ప్రారంభించాలని ఎన్నోసార్లు నిరసనలు చేపట్టాం. ఇటీవల గుత్తేదారులు పనులు చేపట్టినా నాణ్యత ప్రమాణాలు పాటించ లేదు. అనేక చోట్ల బీటీ ఇంచు మందం కూడా లేదు.

– జాడె తిరుపతి, ఖమాన

బీటీ వేసే సమయంలో నిలదీశా..



రోడ్డుపై దుమ్ము, మట్టి ఉండగానే బీటీ వేశారు. ఆ సమయంలోనే నిలదీశాను కానీ అలాగే పనులు చేపట్టారు. ఇప్పుడు రోడ్డు పనులు నిలిపి వేస్తే మళ్లీ బీటీ వేస్తారో లేదోనని గ్రామస్తులు మాట్లాడకుండా ఉండిపోయారు. 2.5 కి.మీల రోడ్డు నిర్మాణం ఇష్టారీతిన చేపట్టారు.

– విలాస్, ఖమాన

ఉత్సవాలకు వేళాయె..!

- నేటి నుంచి పంచాశత్ వార్షికోత్సవాలు
- ముస్తాబైన శివాలయం


కౌటాల: మండల కేంద్రంలోని సదాశివపేట శివాలయ 51వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజుల పాటు ఉత్సవాలను నిర్వహించనున్నారు. స్వయంభూగా వెలిసిన ఈశ్వరుడికి స్థానిక శివాలయంలో నేటి నుంచి 51 సంవత్సరాల పంచాశత్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నారు. ఇందుకు సదాశివపేట శివాలయం విద్యుత్ కాంతులతో ముస్తాబైంది. ఆలయ ఆవరణలో అగ్నిగుండం ప్రవేశం కోసం గుండం ఏర్పాటు చేశారు. ఆలయంలో శ్రీ భద్రకాళి సహిత వీరభద్ర అగ్నిగుండ మహోత్సవాలను ఏటా ఘనంగా నిర్వహిస్తారు.

మూడు రోజుల పాటు..

51వ వార్షికోత్సవంలో భాగంగా ఆలయంలో మూడు రోజుల పాటు ఆలయ ప్రధాన అర్చకులు అంబేద శంకరయ్య ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ నెల 22న ఆదివారం ఉదయం శివుని ఆరాధన, హారతి, గ్రామ దేవతలకు ఆరాధన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం ప్రత్యేక పూజలతో శివాలయం నుంచి పార్వతి పరమేశ్వరుల పల్లకి ఊరేగింపు కార్యక్రమాన్ని మండల కేంద్రంలోని సాయిబాబా ఆలయం వరకు నిర్వహిస్తారు. ఈ సందర్భంగా పలువురు కళాకారులచే ప్రత్యేక సంస్కృతిక నృత్యాలు నిర్వహించనున్నారు.

23న మహా గణపతి హోమం..

మహోత్సవాల్లో భాగంగా రెండోరోజు సోమవారం శివాలయంలో ఉదయం శివుని ఆరాధన, హారతి, అఖండ దీపారాధన, గణపతి పూజ, స్వస్తి వచనము, నవగ్రహ ఆరాధన, పంచకలశ ఆరాధన, అంకురార్పణ, రుద్రాభిషేకం, ధ్వజారోహణ, మహా గణపతి హోమం, అగ్ని ప్రతిష్ఠ, హారతి మంత్రపుష్పం, భక్తులకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం ఆలయంలో వీరభద్రకాళి పూజలు, లక్ష దీపోత్సవ కార్యక్రమం, మహా రుద్ర హోమ హారతి కార్యక్రమాలతో భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. రాత్రి ఆలయంలో అగ్నిగుండ భూమి పూజ, అగ్నిగుండాల ప్రజ్వలన నిర్వహించనున్నారు. ఈ నెల 24న ఉదయం ఆలయంలో ఉదయం 5 గంటలకు అగ్నిగుండ ప్రవేశం, రుద్రహోమం, పూర్ణాహుతి, ఆశీర్వచనం కార్యక్రమాలు నిర్వహిస్తారు. దీంతో ఆలయంలో మూడు రోజుల పాటు భక్తుల సందడి నెలకొననుంది.


ముస్తాబైన సదాశివపేట శివాలయం

ఉత్సవాలకు ఏర్పాట్లు పూర్తి



కౌటాలలోని శివాలయానికి 51 ఏళ్లు పూర్తయ్యాయి. దీంతో నేటి నుంచి మూడు రోజుల పాటు పంచాశత్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించనున్నాం. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశాం. ఆలయంలో మహాగణపతి హోమం, అగ్నిగుండాల ప్రవేశం, ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహిస్తాం. ఉత్సవాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలి.

– అంబేద శంకరయ్య, శివాలయ ప్రధాన అర్చకుడు, కౌటాల

సమగ్రశిక్ష ఉద్యోగుల ఆందోళనకు మద్దతు

ఆసిఫాబాద్: తమ ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేస్తూ జిల్లా కేంద్రంలోని కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న సర్వశిక్ష అభియాన్ కాంట్రాక్టు ఉద్యోగుల ఆందోళనకు కరీంనగర్ టీచర్ ఎమ్మెల్సీ అభ్యర్థి పోలు సత్యనారాయణ మద్దతు తెలిపారు. శనివారం జిల్లా కేంద్రంలోని శిబిరాన్ని సందర్శించారు. ప్రభుత్వం సమగ్రశిక్ష ఉద్యోగుల డిమాండ్లను నెరవేర్చాలని పేర్కొన్నారు. ఆయన వెంట తాటి రాజేశ్వర్ రావు, మహేశ్, శృతిక, తుకారం, ఉద్యోగులు ఉన్నారు.

అలరించిన 'వెల్‌బేబీ షో'

రెబ్బెన: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని గోలేటి డిస్పెన్సరీలో శనివారం నిర్వహించిన వెల్‌బేబీ షో అలరించింది. బుడిబుడి అడుగులు వేసే చిన్నారుల ఆట, పాటలను ఆసక్తిగా తిలకించారు. వైద్యులు చిన్నారుల ఆరోగ్య పరిస్థితి వారి తల్లిదండ్రులను అడిగి తెలుసుకున్నారు. వ్యాక్సినేషన్ రికార్డులను పరిశీలించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని మించిన సంపదలేదన్నారు. చిన్నారులకు పౌష్టికాహారాన్ని అందించి క్రమం తప్పకుండా వ్యాక్సిన్లు వేయించాలని సూచించారు. ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్. తిరుపతి, సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, డీవైసీఎంవో మధుకుమార, డీవైఎంఎస్ మురళీమోహన్, పర్సనల్ మేనేజర్ రెడ్డిమల్ల తిరుపతి, సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏరియా వర్క్‌షాప్‌లో రక్షణ పక్షోత్సవాలు

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని ఏరియా వర్క్‌షాప్‌లో శనివారం 55వ రక్షణ పక్షోత్సవాలను ఘనంగా నిర్వహించారు. రక్షణ తనిఖీ బృందం కన్వీనర్, జీఎం ఈఅండ్ఎం దామోదర్ సారథ్యంలో బృందం సభ్యులు, ఏరియా జీఎం శ్రీనివాస్‌తో కలిసి ఏరియా వర్క్‌షాప్‌ను పరిశీలించారు. తనిఖీ బృందం కన్వీనర్ మాట్లాడుతూ అన్ని విభాగాల ఉద్యోగుల రక్షణకు సింగరేణి యాజమాన్యం పటిష్టమైన చర్యలు చేపడుతోందన్నారు. పని ప్రదేశాల్లో రక్షణ సూత్రాలను తూచా తప్పకుండా పాటిస్తూ గని ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు. అనంతరం ప్రథమ చికిత్స చేసే విధానాన్ని పరిశీలించారు. ట్రేడ్‌టెస్ట్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. కళాకారులు, పాటలు నాటిక ద్వారా రక్షణ ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ గోలేటి బ్రాంచి కార్యదర్శి ఎస్.తిరుపతి, ఎస్‌వోటూజీఎం రాజమల్లు, ఏరియా ఇంజనీరు భీంరావు జాడే, వర్క్‌షాప్ డీజీఎం కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.


షోను తిలకిస్తున్న ఏరియా జీఎం శ్రీనివాస్

ఏఈఈల జిల్లా కార్యవర్గం


ఎన్నికైన ఏఈఈలు

ఆసిఫాబాద్: జిల్లాలోని ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వహిస్తున్న అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ల జిల్లా కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ్‌కుమార్, అసోసియేట్ అధ్యక్షుడిగా ప్రశాంత్, ప్రధాన కార్యదర్శిగా పవన్‌కళ్యాణ్, ఉపాధ్యక్షులుగా సాయికృష్ణ, మౌనిక, కోశాధికారిగా సాయితేజ, సంయుక్త కార్యదర్శులుగా క్రాంతి, సాయి సిద్దార్థ, ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులుగా మణితేజ, స్వామి ఎన్నికయ్యారు.

ఆకట్టుకున్న బాలమేళా

రెబ్బెన: మండలంలోని రాళ్లపేటలో శనివారం ఐసీడీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించిన బాలమేళా కార్యక్రమం ఆకట్టుకుంది. పలు అంగన్‌వాడీ కేంద్రాలకు చెందిన పిల్లలు ఆయా కేంద్రాల్లో నేర్చుకున్న కార్యక్రమాలను, మంచి అలవాట్లను ప్రదర్శించారు. చిన్నారుల ప్రదర్శన గ్రామస్తులను ఎంతగానో ఆకట్టుకుంది. ఐసీడీఎస్ సీడీపీవో సాదికా రుక్సానా మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. సూపర్‌వైజర్ కళావతి, అంగన్‌వాడీ టీచర్లు సునీత, సింధూర, ఇందిరా, ప్రభావతి తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'దీపాలంకరణ'

రెబ్బెన: సింగరేణి ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని శనివారం రాత్రి గోలేటి టౌన్‌షిప్‌లోని భీమన్న స్టేడియంలో నిర్వహించిన దీపాలంకరణ పోటీలు ఆకట్టుకున్నాయి. పోటీల్లో ఉద్యోగుల కుటుంబాల మహిళలు, పరిసర గ్రామాల మహిళలు ఉత్సాహంగా పాల్గొని రంగురంగులతో అందమైన, ఆకర్షణీయ ముగ్గులు వేశారు. వేడుకలకు సేవా సమితి అధ్యక్షురాలు ఉమారాణి, బెల్లంపల్లి ఏరియా జీఎం శ్రీనివాస్‌లు హాజరై ముగ్గులను పరిశీలించారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు సింగరేణి డే వేడుకల్లో బహుమతులు అందజేయనున్నట్లు అధికారులు తెలిపారు. సీనియర్ పర్సనల్ అధికారి ప్రశాంత్, సేవా సమితి సభ్యురాలు శంకరమ్మ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే మంత్రికి వినతి

రెబ్బెన: మండల కేంద్రంలోని ఆసిఫాబాద్‌రోడ్ రైల్వేస్టేషన్‌లో కాగజ్‌నగర్ ఎక్స్‌ప్రెస్‌కు హాల్టింగ్ సౌకర్యం కల్పించాలని సేవాలాల్ చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, చైర్మన్ డాక్టర్ అజ్మీర రామారావు కేంద్ర రైల్వేశాఖ మంత్రికి శనివారం ఈమెయిల్ ద్వారా వినతిపత్రాన్ని పంపించారు.

చట్టాలపై అవగాహన

ఆసిఫాబాద్‌అర్బన్: జిల్లాలోని బాలికలకు భరోసా టీం ఆధ్వర్యంలో చట్టాలపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు భరోసా టీం ఇన్‌చార్జి ఎస్సై తిరుమల అన్నారు. ఇందులో భాగంగా శనివారం సిర్పూర్ (యూ) మండల కేంద్రంలోని కస్తూరిబా బాలికల పాఠశాలలో విద్యార్థులకు చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. బాలబాలికలు, అత్యాచార బాధితులకు భరోసా సెంటర్‌ను ఎలా ఆశ్రయించవచ్చో వివరించామన్నారు. అత్యవసర సమయాల్లో డయల్ 100కు కాల్ చేయాలని, భరోసా సెంటర్ నంబర్ 87126 70561, ఆసిఫాబాద్ సబ్ డివిజన్ షీటీం నంబర్ 87126 70564, చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్ 1098ని సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది, భరోసా టీం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీఆర్టీల డిమాండ్లు నెరవేర్చాలి

కెరమెరి: సీఆర్టీల డిమాండ్లు నెరవేర్చాలని ఆదివాసీ విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడు మడావి భరత్ కోరారు. శనివారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. 20 ఏళ్లుగా గిరిజన విద్యార్థులకు సేవలందిస్తున్న సీఆర్టీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మాజీ ఎంపీపీ పెందోర్ మోతీరాం, నాయకులు సోము, జగన్నాథ్‌రావు, అంబారావు, శంకర్, మధూకర్, పోచయ్య తదితరులున్నారు.

నాణ్యమైన భోజనం అందించాలి

సిర్పూర్(టి): ప్రభుత్వ పాఠశాలలు, సంక్షేమ గురుకులాలు, వసతి గృహాల్లో నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ శ్రీనివాస్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని సోన్‌పేట్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు మధ్యాహ్నం అందజేస్తున్న మధ్యాహ్న భోజనం పరిశీలించారు. పాఠశాల రికార్డులతో పాటు పరిసర ప్రాంతాలను, వంటగదిని పరిశీలించారు. భోజన వసతిలో ఎలాంటి నిర్లక్ష్యం వహించొద్దని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలన్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి మెనూ వివరాలు తెలుసుకున్నారు.

పెంచికల్‌పేట్‌లో..

పెంచికల్‌పేట్: పెంచికల్‌పేట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని శనివారం తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావు పరిశీలించారు. అనంతరం పాఠశాలలోని బియ్యం నిల్వ చేసే ప్రదేశాన్ని, వంట గదిని పరిశీలించి పలు సూచనలు చేశారు. మధ్యాహ్న భోజన నిర్వాహకులు తప్పకుండా మెనూ పాటించాలన్నారు. ఆయన వెంట హెచ్ఎం యాదగిరి ఉన్నారు.

పాఠశాలలో పీటీఎం..

పెంచికల్‌పేట్ ఉన్నత పాఠశాలలో శనివారం పేరెంట్స్ టీచర్ మీటింగ్ (పీటీఎం) నిర్వహించారు. ఈసందర్భంగా విద్యార్థుల ప్రగతిని విద్యార్థుల తల్లిదండ్రులకు వివరించారు. పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సిర్పూర్ (టి): మధ్యాహ్న భోజనం పరిశీలిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్

కెరమెరిలో..

కెరమెరి: విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని తహసీల్దార్ దత్తుప్రసాద్ అన్నారు. మండలంలోని అనార్‌పల్లి ఆశ్రమ ఉన్నత పాఠశాల, ప్రాథమికోన్నత పాఠశాల సుర్దాపూర్‌ను శనివారం ఆయన సందర్శించారు. వంటగదులు, స్టోర్‌రూంలో ఉన్న వంట సరుకులను, స్టాక్ రిజిస్టర్‌ను పరిశీలించారు. అనంతరం మాట్లాడారు. వంట గదుల్లో శుభ్రత పాటించాలని, తాజా కూరగాయలతో వంటలు చేయాలన్నారు. విద్యార్థులకు వడ్డించే ముందు ఉపాధ్యాయులు తినాలని, ఆ తర్వాతనే విద్యార్థులకు వడ్డించాలన్నారు. సరుకుల్లో నాణ్యత పాటించాలన్నారు. నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని తయారు చేసి ఇవ్వాలన్నారు. విద్యార్థులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. హెచ్ఎం సురేశ్ తదితరులు ఉన్నారు.

పోషక విలువల భోజనం అందించాలి..

పోషక విలువలతో కూడిన భోజనాన్ని విద్యార్థులకు అందిస్తున్నామని ఎంఈవో ఆడే ప్రకాశ్ అన్నారు. శనివారం మండలంలోని గోయగాం ఉన్నత పాఠశాలలో 'ఆహారోత్సవం'పై నిర్వహించిన పీటీఎం సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతీ నెలలో చివరి శనివారం పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహిస్తామని, తల్లిదండ్రులు తప్పక హాజరు కావాలన్నారు.

చింతలమానెపల్లిలో..

చింతలమానెపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం నిర్వహణను శనివారం తహసీల్దార్ మునావర్ షరీఫ్, ఎంఈవో జయరాజ్‌లు పరిశీలించారు. పాఠశాలలో వసతులను, భవనాలను, సౌకర్యాలను అధికారులు తెలుసుకున్నారు.

కౌటాలలో..

కౌటాల: ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు పౌష్టికాహారం అందించాలని ఎంపీడీవో కోట ప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని ముత్తంపేట్ ప్రాథమిక పాఠశాలను ఆయన పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ మెనూ ప్రకారం విద్యార్థులు భోజనం పెట్టాలని తెలిపారు. ఆయన వెంట ఎంఈవో గావుడే హన్మంతు, ఉపాధ్యాయులు ఉన్నారు.


పెంచికల్‌పేట్‌లో..


కెరమెరి: సుర్దాపూర్‌లో..


కెరమెరి: మాట్లాడుతున్న ఎంఈవో ప్రకాశ్

పీఆర్టీయూటీఎస్ సభ్యత్వానికి రాజీనామా

కెరమెరి: మండలంలోని వివిధ పాఠశాలలకు చెందిన ఉపాధ్యాయులు పీఆర్‌టీయూటీఎస్ సభ్యత్వానికి శనివారం రాజీనామా చేశారు. ఈ మేరకు సంఘం అ ధ్యక్ష, కార్యదర్శులకు వాట్సాప్‌లో తమ రాజీనామా పత్రాన్ని పంపించారు. పీ ఆర్టీయూటీఎస్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి ఆడే ప్రకాశ్ రాజీనామా చేయడంతో ఆయనకు మద్దతుగా ఉపాధ్యాయులు ఆడే మౌనిక, అనక కల్పన, విఠోబా, ఎం.నరేశ్, ఆడే ధన్‌లాల్, విద్యాసాగర్, వై నగేశ్, ఎం.తుకారాం, సుగుణ, ఎస్కే ముహిబోద్దీన్, అశ్విన్, సమ్మయ్య, సంతోష్, ఏ.నరేశ్‌లు రాజీనామా చేశారు.


రాజీనామా చేస్తున్న ఉపాధ్యాయులు

ఉమ్మడి జిల్లా హ్యాండ్‌బాల్ పోటీలు

ఆసిఫాబాద్‌రూరల్: ఉమ్మడి ఆదిలాబాద్ సీఎం కప్ హ్యాండ్‌బాల్ పోటీలను జిల్లా కేంద్రంలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో శనివారం డీవైఎస్‌వో రమాదేవి ప్రారంభించారు. డీఎస్‌వో మీనారెడ్డి మాట్లాడుతూ సీఎం కప్ క్రీడా పోటీల్లో 200 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. మంచిర్యాల జట్టు ప్రథమ స్థానం, ఆసిఫాబాద్ ద్వితీయ స్థానంలో నిలిచాయన్నారు. ఈ నెల 27 నుంచి 29 వరకు వరంగల్ జిల్లా హనుమకొండలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఏసీఎంవో ఉద్దవ్, కోచ్ అరవింద్, విద్యాసాగర్, తిరుమల్, హెచ్ఎం జంగు, పీడీ పీఈటీలు రాకేశ్, రవి పాల్గొన్నారు.

ఘనంగా గణిత దినోత్సవం

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలోని బూర్గుడ ఉన్నత పాఠశాలలో శనివారం గణిత శాస్త్రవేత్త శ్రీనివాస రామానుజన్ జయంతి పురస్కరించుకుని జాతీయ గణిత దినోత్సవం ఘనంగా నిర్వహించారు. హెచ్ఎం సదాశివ్ మాట్లాడుతూ గణిత పితామహుడుగా శ్రీనివాస రామానుజన్ గణితంపై అందించిన సేవలను విద్యార్థులకు వివరించారు. శ్రీనివాస రామానుజన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.